క్లుప్తంగా

జోరుగా ప్రచారం



బిల్లేకల్లులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆస్పరి: మంత్రి గుమ్మనూరు జయరాం సూచనల మేరకు మంగళవారం మండలంలోని బిల్లేకల్లు, ముత్తుకూరు గ్రామాలలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డికి మద్దతుగా సర్పంచులు శ్రీను, తోయజాక్షప్ప, నాయకులు హనుమంతరెడ్డి, విజయ్‌కుమార్, మల్లప్ప, నాగరాజు, అనిల్ ప్రచారం నిర్వహించారు. ఆ గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందిని కలిసి ఓటు అభ్యర్థించారు.

హొళగుంద: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మంగళవారం లింగంపల్లి, పెద్దగోనెహాళ్, ఇంగళదహాళ్, ఎం.డీ హళ్లి గ్రామాల్లో ఎంపీటీసీ మల్లికార్జున, ఎస్కే గిరి, నాయకులు విరుపాక్షరెడ్డి, శంబులింగ, మౌనేష్, తదితరులు ప్రచారం నిర్వహించారు.

మాదిగల వర్గీకరణ కోసం పాదయాత్ర



పాదయాత్ర చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులు

మద్దికెర: మాదిగల వర్గీకరణ కోసం పోరాటాలు చేసి సాధించుకుంటామని ఎంఎస్‌పీ మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి సుభాష్ చంద్ర మాదిగ అన్నారు. మాదిగల చిరకాల స్వప్నం ఏబీసీడీ వర్గీకరణ కోసం మంగళవారం మద్దికెర నుంచి కర్నూలు వరకు చేపట్టిన మహాసంగ్రామ పాదయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి మాట తప్పారన్నారు. బీజేపీతో తాడోపేడో తేల్చుకునేందుకు మార్చి 15న రాజధాని దిగ్బంధం కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లా నాయకులు పులికొండ, ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ రవిమాదిగ, మండలాధ్యక్షుడు రాఘవేంద్ర, ఆనంద్, గాదిలింగ, గిడ్డయ్య, దుర్గప్ప తదితరులు పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతో మెలగాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పురుషోత్తం

కృష్ణగిరి: ఎలాంటి వైషమ్యాలు లేకుండా ఎదుటి వారిని గౌరవించాలని తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. మండల పరిధిలోని అమకతాడు ఎస్సీ కాలనీలో మంగళవారం పౌరహక్కుల సదస్సు నిర్వహించారు. ప్రతి మనిషి ఎదుటివారిని గౌరవించాలే తప్పా అంటరానివాడిలా చూడకూడదన్నారు. ప్రతిఒక్కరూ మానవతా దృక్పథంతో మెలగాలని సూచించారు. గ్రామాల్లో ఇంకా సమస్యలు తలెత్తున్నాయంటే అందుకు కారణం చదువులేకపోవడమే అన్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను చదివించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని పేదరికాన్ని జయించాలని సూచించారు. పంతాలు పట్టింపులకు పోకుండా ఐకమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏఎస్‌ఐ గణేష్‌బాబు, సర్పంచ్ బోయ సర్వేశ్వరి, బాల మిన్నెల్ల, ఆర్‌ఐ మస్తాన్ పాల్గొన్నారు.

సబ్‌ట్రెజరీ అధికారికి వీడ్కోలు

పత్తికొండటౌన్: పత్తికొండ సబ్‌ట్రెజరీ అధికారి బి.వెంకటేశ్వర్లు మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం స్థానిక కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు దంపతులను ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఎన్‌జీఓ సంఘాల నాయకులు శాలువా, పూలమాలలు, మొమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఆర్‌డీఓ మోహన్‌దాసు, ఉద్యోగసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోండి



అధికారులతో వాగ్వాదం చేస్తున్న సర్పంచ్‌లు

ఆలూరు: అధికారుల నిర్లక్ష్య ధోరణి వల్ల ప్రజలకు సమాధానం చెప్పకోలేకపోతున్నామని ఆలూరు మండలంలోని వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ రంగమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరికెర, తుంబళబీడు, మొలగవెల్లి, కురుకుంద, తదితర గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నాగరాజ్, సోమలింగమ్మ, దేవిరెడ్డి, తదితరులు మాట్లాడారు. ప్రధానంగా విద్యుత్ సరఫరాలో లోపాలు, తాగునీటి సరఫరా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నిర్లక్ష్య ధోరణి, వివిధ సమస్యలపై అధికారులను నిలదీశారు. గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రంగమ్మ, ఎంపీడీఓ అల్లబకాష్, ఏపీఓను ఆదేశించారు.

మహిమాన్వితుడు హుచ్చువీరప్ప తాత

- పెద్దహోతూరులో ముస్తాబవుతున్న ఆలయం
- కలశ స్థాపనతో ప్రారంభమైన ఉత్సవాలు
- మార్చి 2న రథోత్సవం



ఉత్సవాలకు ముస్తాబవుతున్న రథం



హుచ్చువీరప్ప తాత మూలవిరాట్

ఆలూరు రూరల్/ఆలూరు: కొలిచే వారికి కొంగు బంగారం హుచ్చువీరప్ప తాత, మరకట్టు గ్రామంలో కొలువైన చలువప్ప తాత రథోత్సవం మార్చి 2న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఆలూరు మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో కొలువైన హుచ్చువీరప్ప తాత ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని విద్యుదీపాలతో అలంకరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గత 27వ తేదీన మరకట్టు గ్రామంలో కొలువైన చలువప్ప తాత ఉత్సవమూర్తిని పెద్దహోతూరు గ్రామానికి తీసుకొచ్చిన అనంతరం కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 28న ధ్వజారోహనం నిర్వహించగా, మార్చి 2న రథోత్సవం, 3న గంగి పూజ, 4న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి. 2వ తేదీ ఉదయం గణపతి పూజ, సర్వ దేవతా మండల పూజ, హుచ్చు వీరప్ప తాతకు పంచామృతాభిషేకం, సుదర్శన, రుద్ర హోమం నిర్వహించి సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు. వసంతోత్సవం రోజు చలువప్ప తాత ఉత్సవ మూర్తికి గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం మరకట్టు గ్రామం చేరుతారని ఆలయ అర్చకులు చంద్రమౌళి స్వామి తెలిపారు.

హుచ్చువీరప్ప తాత మహిమలు

పెద్దహరాతూరులో కొలువైన హుచ్చు వీరప్ప తాత జీవ సమాధి అయ్యారు. పూర్వం ఆయన మహిమలతో భక్తులను కాపాడేవారని చరిత్ర చెబుతోంది. పెద్దహోతూరు నుంచి ఆయన పాదయాత్రగా హంపి క్షేత్రానికి వెళ్లి అక్కడ హంపి గ్రామంలోని తుంగభద్ర నదిలోని సుడిగుండంలో దూకి మూడు రోజుల తరువాత నాగభరణంతో గంగా జలాన్ని తీసుకొచ్చారు. ఆ నాగభరణం ఇప్పటికీ ఆలయంలో తాత శిరస్సుపై ముస్తాబై ఉంది. ఉత్సవాల్లో భాగంగా ఏటా హుచ్చు వీరప్ప భక్తులు హంపి గ్రామానికి వెళ్లి గంగా జలాన్ని తీసుకొచ్చి అభిషేకం చేస్తారు.

7 రోజుల పాటు గంగి పూజ

రథోత్సవం సందర్భంగా హుచ్చు వీరప్ప ఆలయంలో గత 27వ తేదీ నుంచి గంగపూజ ప్రారంభం అయ్యింది. 4వ తేదీ వరకు ప్రతి రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి గంగి పూజ, కలశస్థాపన నిర్వహిస్తారని తాత గారి వంశీకులు సిద్దయ్య స్వామి తెలిపారు. ప్రతి రోజు నిర్వహించే ఈ పూజ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. ఆలయాన్ని సందర్శించే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. రథోత్సవానికి ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు. రథోత్సవం సందర్భంగా గ్రామంలో ఉచిత అన్నదాన కార్యక్రమంతో పాటు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



హుచ్చు వీరప్ప తాత రథోత్సవం సందర్భంగా ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. రథోత్సవం ముస్తాబు పని కొనసాగుతోంది. సోమవారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభించాం. మార్చి 2న రథోత్సవం, 4వ తేదీన వసంతోత్సవంతో వేడుకలు ముగుస్తాయి. ఆలయం సందర్శించే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం. – చంద్రమౌళి స్వామి, ఆలయ అర్చకులు

4 నుంచి రంగనాథుడి బ్రహ్మోత్సవాలు



రంగనాథుడి దేవాలయం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన, కొలిచే వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న రంగనాథుడి వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పది రోజుల పాటు వైభవంగా నిర్వహిందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 4న ధ్వజారోహణం, 5న సింహోత్సవం, 6న శేషోత్సవం, 7న లంకోత్సవం, 8న గరుడోత్సవం, 9న గజోత్సవం, 10న స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. కల్యాణానికి నూతన వస్త్రాలు, మండపం ఏర్పాటు, అలంకరణ, రథోత్సవం, పాన్పు సేవకు గ్రామానికి చెందిన పారా రామన్న కుమారులు రామచంద్రప్రసాద్, విశ్వనాథ్ పుష్పాలంకరణ చేయించనున్నారు. అదే రోజు ఉదయం 10 గంటలకు రథాంగ హోమం, బ్రహ్మరథం సాయంత్రం అశేష జనవాహిని మధ్య రథోత్సవం నిర్వహిస్తారు. 11న అశ్వవాహనం, 12న ఉదయం పూర్ణహుతి, వసంతోత్సవం, రాత్రి హంస వాహనం, 13న ద్వాదశ ప్రదక్షిణోత్సవాలు, రాత్రి పాన్పు సేవ ఉంటాయన్నారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి 9 గంటలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఆలయ చరిత్ర: స్వతహాగా వైకుంఠ ద్వారం కలిగిన ఈ ఆలయంలో రంగనాథ స్వామి, శ్రీదేవి, భూదేవి సమేతుడై నిత్యం పూజలందుకుంటున్నారు. స్వామివారు ద్వాదశ అళ్వారులతో వెలసిన వైష్ణవ క్షేత్రం. ఎందరో మహర్షులు తపమాచరించి వారు దర్శించుకునేందుకు శ్రీమన్నారాయణుడే కపిల మహర్షి అవతారమెత్తి శ్రీ రంగనాథస్వామి సాల



శ్రీరంగనాథుడి మూల విరాట్

గ్రామం ఇచ్చట ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయి. తదుపరి విజయనగరరాజులు హరిహర రాయలు, బుక్కరాయలు క్రీ.శ. 1336–37లో ఆలయం నిర్మించినట్లు ఆలయ నిర్వహణకు వెయ్యి ఎకరాల మాన్యం ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. పిలిస్తే పలికే రంగనాథస్వామిగా విరాజిల్లుతూ భక్తులు కోరికలు తీరుస్తూ నిత్యం పూజలదుకుంటున్నాడు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు



రంగనాథ స్వామిని ఇలవేల్పుగా కొలుచుకుంటూ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయ ఆవరణలో అన్నదాన ఏర్పాట్లు కూడా చేశాం. తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రసాదాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాం.

– బి.చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ ఈఓ

నేడు మంగమాంబ రథోత్సవం

ఆలూరు రూరల్: మండలంలోని కరిడిగుడ్డం గ్రామంలో కొలువైన అవధూత మాంగమాంబ, కమ్మరచేడు గ్రామంలో మంగమ్మ అవ్వ రథోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవం లాగనున్నారు. రథోత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. కరిడిగుడ్డం, కమ్మరచేడు గ్రామాల్లో రథోత్సవాలకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ డాక్టర్ నాయక్ విలేకరులకు తెలిపారు.

కరిడిగుడ్డంలో కొలువైన మంగమాంబ →



ఘనంగా టైలర్స్ డే

నందవరం: మండలంలోని టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం టైలర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ఎస్‌ఎస్‌వీ టైలర్ షాపులో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వలి, సీనియర్ టైలర్స్ ఇస్మాయిల్ కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం సీనియర్ టైలర్ ఇస్మాయిల్‌ను శాలువా, పూలమాలలతో సన్మానించారు. టైలర్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు వలి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టైలర్ల సంక్షేమం కోసం జగనన్న చేదోడు పథకం ద్వారా ఏటా రూ.10 వేలు అందించడం ఆనందదాయకమన్నారు. ప్రస్తుత కాలంలో రెడీమేడ్ దుస్తులు రావడంతో టైలర్లు ఆదరణ కోల్పోతున్నారని వాపోయారు. టైలర్లు శశికళ, ఏసేపు, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: స్థానిక టైలర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డేను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. 1846 ఫిబ్రవరి 28న కుట్టుమిషన్ సృష్టించిన జర్మనీ దేశీయుడు విలియమ్స్ హొవేను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసోషియేషన్ మండలాధ్యక్షుడు



నందవరంలో మహిళలకు కుట్టు మిషన్ పనిముట్లను అందజేస్తున్న దృశ్యం

తిమ్మప్ప ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, సిబ్బందికి పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. తిమ్మప్ప మాట్లాడుతూ రెడీమేడ్ రంగం విస్తరణతో టైలర్ల జీవితాలు కష్టంగా మారాయన్నారు. తమను ఎవ్వరూ గుర్తించలేదని ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా రూ.10 వేలు సాయం అందిస్తుండడంపై ఆనందం వెలిబుచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ బాలచంద్రారెడ్డి, అసోషియేషన్ ప్రతినిధులు ఉస్మాన్, రసూల్, రాజు, కృష్ణ, దస్తగిరి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

తీరిన 'దారి'ద్ర్యం .. సాఫీగా ప్రయాణం





పత్తికొండ-ఆదోని రోడ్డులో గుంతల నడుమ అవస్థల ప్రయాణం, నూతనంగా వేసిన రోడ్డుతో సాఫీగా ప్రయాణం

పత్తికొండ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చొరవతో పల్లెలకు ప్రగతి బాట పరచుకుంది. ఇక ప్రయాణం రయ్యిమని సాఫీగా సాగుతుంది. దీంతో ఇన్నాళ్లు పడిన ప్రయాణికుల కష్టాలు తీరాయి. పల్లెలకు మార్గం సుగమం కావడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- గుత్తి-పత్తికొండ-ఆదోని రోడ్డు 4.5 కిలోమీటర్ల పొడవున రూ.80 లక్షల వ్యయంతో నూతనంగా బీటీ రోడ్డు నిర్మాణం జరిగింది.
- ఆదోని నుంచి రూ.3.5 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది.
- చిన్నహుల్తి – బిల్లేకల్ 6.5 కిలోమీటర్ల పొడవున రూ.1.75 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు.
- బిల్లేకల్-ఎమ్మిగనూరుకు 16 కిలోమీటర్ల పొడవున రూ.3.5 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. కేవలం 400 మీటర్లు మాత్రమే పెండింగ్‌లో ఉండగా ఇది త్వరలో పూర్తి కానుంది.
- కరివేముల-ఆరేకల్‌కు 6 కిలోమీటర్ల పొడవున రూ.1.8 కోట్ల వ్యయంతో రోడ్డు పనులు జరుగుతున్నాయి.
- గుత్తి నుంచి రూ.5 కోట్ల అంచనా వ్యయంతో పనులు జరుగుతున్నాయి. నెల రోజుల్లో రోడ్డు పూర్తయ్యే అవకాశం ఉంది.

సాయి నామస్మరణతో ఓలలాడిన భక్తజనం

ఎమ్మిగనూరు: ''ఓం సాయి.. శ్రీసాయి.. జయజయసాయి..అంటూ భజన కీర్తనలు..భక్తి పారవశ్యంతో భక్తజనం ఓలలాడగా శ్రీసాయి పల్లకోత్సవం జరిగింది. స్థానిక శిల్పా ఎస్టేట్ సమీపంలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో మంగళవారం 15వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5.15 గంటలకు సాయిబాబాకు కాగడ హారతితో పూజలు మొదలయ్యాయి. అనంతరం సుప్రభాతసేవ, అభిషేకం, 8 గంటలకు ఉచిత సామూహిక సాయి సత్యవ్రతములు, 9 గంటలకు చందనోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు హారతి, 1 గంటకు శిల్పా ఎస్టేట్‌లో స్వామివారి పల్లకోత్సవం ఊరేగింపు జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు సంధ్యాహారతి, 6.30 గంటలకు పుష్పాభిషేకంతో పూజలు ముగించారు. సాయిరుత్విక్ ఆడిటర్ మహానందయ్య, కేఎం శ్రీనివాసులు, సాయి ఉషా శ్రీనివాసులు, ఈసీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న సాయినాథుడు

పెట్రోల్ బంకు తనిఖీ

హొళగుంద: మండల కేంద్రంలోని విజయదుర్గ పెట్రోల్ బంక్‌ను మంగళవారం తహసీల్దారు హుసేన్‌సాహెబ్ తనిఖీ చేశారు. బంకులో ప్రమాద జాగ్రత్తలు, నిబంధనాలు పాటిస్తున్నారా? పెట్రోల్ నాణ్యత, కొలతలు, అమ్మకపు ధరలు, టాయిలెట్స్ ఇతర వాటి గురించి ఆరా తీశారు. అలాగే ప్రభుత్వం నిర్ణయించిన ధరకే పెట్రోలు, డీజిల్ అమ్మాలని నాణ్యత విషయంలో ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీఆర్‌ఓ నాగరాజు తదితరులు ఉన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్‌డే

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్ సీవీ రామన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఏషియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ జనరల్ మేనేజర్ డాక్టర్ మల్లికార్జునతో ఆన్‌లైన్ సెమినార్ నిర్వహించారు.

నేటి నుంచి ఉరుసు

ఎమ్మిగనూరు: శ్రీ వరసిద్ది పద్మ సద్గురు బడేసాబ్ ఉరుసు మహోత్సవాలు బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ధర్మకర్త సుకన్యదేవి, కేబీ వీరన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోసిగి రోడ్డులో వెలసిన బడేసాబ్ తాత ఉత్సవాల్లో భాగంగా 1వ తేదీ గంధం, 2వ తేదీ ఉరుసు, రాత్రి హీరాపురం హనుమంతప్ప భక్త బృందంచే భజన సంకీర్తనలు ఉంటాయన్నారు. 3వ తేదీ జియారత్ గంధం, రాత్రి 8 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

ఘనంగా దేవర

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చక్రాళ్ల గ్రామంలో గ్రామ దేవతలు పెద్దమ్మ దేవి, అయ్యమ్మ దేవి దేవర ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు బోనాలను సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బంధుమిత్రులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

నేడు పింఛన్ల పంపిణీ

తుగ్గలి: మండలంలో బుధవారం నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్‌ఎం బాషా తెలిపారు. మండల వ్యాప్తంగా 7,625 మంది పింఛన్‌దారులకు పంపిణీ చేసేందుకు రూ.2,11,88,255 నగదు మంజూరైందన్నారు. వలంటీర్లు ఉదయం నుంచే లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేస్తారని చెప్పారు.

మాజీ సైనికులను ఆదుకోవాలి

మద్దికెర: దేశసేవ చేసి పదవీ విరమణ పొందిన మాజీ సైనికులకు ఒక్కొక్కరికి 5 ఎకరాల భూమితో పాటు 5 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని ఆ సంఘం మండలాధ్యక్షుడు సర్కార్ వెంకటరాముడు, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండల మాజీ సైనికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలు ఫణంగా పెట్టి విధులు నిర్వహించిన వారిని ఆదుకోవాలని కోరారు. ఉపాధ్యక్షుడు లింగారెడ్డి, కోశాధికారి వెంకటరాముడు, నాగరాజు స్వామి రావు, ఆది పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం

ఆలూరు రూరల్/హాలహర్వి: హాలహర్వి మండలంలోని చింతకుంట గ్రామంలో మంగళవారం సాయంత్రం నిప్పంటుకుని రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన షఫివుల్లాతో పాటు మరో రైతుకు చెందిన పశుగ్రాసం మంటల్లో కాలి బూడిదైంది. గ్రామస్తులు ఫైర్ అధికారులకు సమాచారం అందించగా.. ఫైర్ సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో రూ.60 వేలు విలువ చేసే పశుగ్రాసం దగ్ధమైనట్లు ఫైర్ అధికారి ఖాద్రి తెలిపారు.

నేడు ఆరాధన

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో వెలసిన నారాయణ తాత 34వ ఆరాధనోత్సవాలు బుధవారం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆలయంలో పాలాభిషేకం, గంగ, ఆకు పూజ, మంగళహారతులు, రథోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

కృష్ణగిరి: 18వ యూత్ ఛాంపియన్ రాష్ట్రస్థాయి పోటీల్లో కంబాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జశ్వంత్ షార్ట్‌పుట్ విభాగంలో రాణించి మూడవ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థి ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో విద్యార్థి జశ్వంత్, వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మయ్యను ఉపాధ్యాయ బృందం, పీఎంసీ చైర్మన్ మోహన్‌రెడ్డి అభినందించారు.

మద్దతు ధరతో జొన్న కొనుగోళ్లు



మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

హొళగుంద: రైతులు పండించిన జొన్నలకు రాష్ట్ర ప్రభుత్వం మంచి ధర కల్పించి కొనుగోలు చేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఆయన మంగళవారం చిన్నహ్యాట గ్రామ సచివాలయంలో జొన్న కొనుగోలు కేంద్రం, ఇతర విషయాలపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నహ్యాట సచివాలయ పరిధిలో రైతులు సాగు చేసిన జొన్న పంట దిగుబడి వివరాలను ఆ గ్రామ వీఏఏ తస్లీమాను అడిగి తెలుసుకున్నారు. 50 మంది రైతుల వద్ద దాదాపు 200 క్వింటాళ్ల జొన్నలు నిల్వ ఉన్నాయని తెలపగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం జవారి రకం జొన్నలను క్వింటాలు రూ.2,970 ప్రకారం కొనుగోలు చేస్తోందని 24 గంటల్లో రైతులకు డబ్బులు చెల్లిస్తోందని చెప్పారు. అదేవిధంగా కూలీలు, ఖాళీ సంచులు, రవాణా చార్జీలు మిగులుతాయని రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మండలంలో జొన్న దిగుబడులు, నిల్వ ఇతర వివరాలను తహసీల్దారు హుసేన్ సాహెబ్, ఏఈఓ విరుపాక్షి, వీఏఏ తస్లీమాను అడిగి తెలుసుకుని సలహాలు, సూచనలు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన ఎరుకలి తిమ్మప్ప

హొళగుంద: స్థానిక సమ్మతగేరి క్రాస్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎరుకలి తిమ్మప్ప (34) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. కర్ణాటక రాష్ట్రం సింధనూరు తాలూకా రౌడకుంద గ్రామానికి ఎరుకల తిమ్మప్ప కొన్నేళ్ల కిందట సుళువాయి గ్రామానికి చెందిన సుశీల అనే మహిళను వివాహం చేసుకుని ఇక్కడే నివాసం ఉంటున్నాడు. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తిమ్మప్ప మంగళవారం రాత్రి హొళగుందలో ఓ శుభకార్యంలో బ్యాండు మేళం వాయించేందుకు బైక్‌పై వెళుతుండగా సమ్మతగేరి క్రాస్ వద్ద మరో బైక్‌పై వస్తున్న సుళువాయికి చెందిన శివప్ప, రమేష్‌లను ఢీకొట్టాడు. ప్రమాదంలో తిమ్మప్ప తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పై వచ్చిన శివప్ప, రమేశ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హొళగుంద ఎస్‌ఐ అబ్దుల్‌జహీర్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స కోసం ఆలూరుకు తరలించారు. తిమ్మప్ప మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆలూరుకు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

అగ్నిమాపక పరికరాల పంపిణీ



పరికరాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ వినోద్‌కుమార్

గోనెగండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో అగ్ని ప్రమాదాలు నివారించేందుకు అగ్నిమాపక పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ వినోద్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం పంపిణీ చేసిన పరికరాలను మంగళవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు పాఠశాలల్లో అగ్ని ప్రమాదం జరిగితే ఈ పరికరాల ద్వారా మంటలు నివారించడంతో పాటు ప్రమాదం నుంచి బయటపడవచ్చన్నారు. మండలంలోని 35 పాఠశాలలకు పరికరాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన దస్తగిరయ్య స్వామి ఉరుసు



కిస్తీ వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

కృష్ణగిరి: మండల కేంద్రంలో మూడు రోజులుగా జరుగుతున్న దస్తగిరయ్య స్వామి ఉరుసు మంగళవారం కిస్తీ వేడుకలతో ముగిసింది. దర్గాలో స్వామి సమాధికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కులమతాలకు అతీతంగా అశేష జనవాహిని మధ్య కిస్తీ వేడుకలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ట్రాక్టర్‌పై నైవేద్యం తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

నేడు ఊరి దేవర్లు

నందవరం: మండల పరిధిలోని టి.సోమలగూడూరు, మాచాపురం గ్రామాల్లో బుధవారం ఊరి దేవర్లు నిర్వహించనున్నారు. మంగళవారం ఆయా గ్రామాల్లోని పెద్దమ్మ, కోటేశ్వరి మాత అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ గావించి విశిష్ట పూజలు చేపట్టారు. పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం భక్తులు భోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఉత్సవాలు చేపట్టారు.